# మనం
## హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్

బుధవారం | 1 | ఏప్రిల్ | 2026 పేజీలు: 8


## ఏందిరయ్యా...ఇదీ...



బైక్ స్టంట్లతో యువకుల ఓవర్ యాక్షన్

పోలీసుల ముందే ప్రమాదకరంగా విన్యాసాలు

నిబంధనలను గాలికి వదిలి ఫోన్‌లో చిత్రీకరణా

వెంటాడి పట్టుకున్న పోలీసులు

పిచ్చి పనులు చేస్తే కఠినచర్యలు తప్పవు

పోలీసుల హెచ్చరిక

3




## ‘అమ్మ’ ఇంటికి తాళం

వేదనగా ‘వేదనిలయం’

రూ. 83 లక్షల మేర ఇంటి పన్ను

జయలలిత ఇంటిని సీజ్ చేసిన జీహెచ్ఎంసీ అధికారులు



2

# అందంగా... ఆరోగ్యం గుల్లా



ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లలో నకిలీ అల్లం పేస్ట్

భారీగా కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ పట్టివేత

రూ. 22 లక్షల సామాగ్రి స్వాధీనం..

హైదరాబాద్ ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ కల్తీ దందాను కొనసాగిస్తున్న ముఠాపై హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు విరుచుకుపడ్డారు. నగర శివారులోని కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రాన్ని మంగళవారం అధికారులు ఛేదించారు.

2



## దాతల పైసలు... పేదలకోసం



పేద ప్రజలకు అందుబాటులో క్యాన్సర్ చికిత్స

రోగులకు త్వరితగతిన చికిత్స అందించటమే మా లక్ష్యం

ఏపి టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

2

## ‘గాంధీగిరి’

కాళ్లు మొక్కుతూ..చెత్త వేయకండి

గాంధీగిరి ఫాలో అవుతున్న జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్..

చెత్త వేసేవారిలో మార్పు తెచ్చేందుకు వినూతన మార్గం



2

# 'గాంధీగిరి'

**కాళ్లు మొక్కుతా..చెత్త వేయకండి**
**గాంధీగిరి ఫాలో అవుతున్న జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్..**
**చెత్త వేసేవారిలో మార్పు తెచ్చేందుకు**
**వినూతన మార్గం**



హైదరాబాద్,మార్చి31(మనం న్యూస్): రహదారిపై చెత్త వేసేవారిలో మార్పు తెచ్చేందుకు ఓ జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్ మహేందర్ వినూత్న మార్గాన్ని ఎంచుకున్నారు. గాంధీగిరి విధానంలో వారిలో మార్పు తెచ్చే ప్రయత్నం చేశారు. ఉదయాన్నే అక్కడకు చేరుకుని రోడ్డుపై చెత్త వేసేవారి కాళ్లు మొక్కుతూ.. ఇలా చేయొద్దని వేడుకున్నారు. గుడిమల్కాపూర్ పరిధిలోని రామసింగాపూరా ప్రాంతంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**అనూహ్య విన్నపం:**

ఇచ్చట మూత్రం పోసినవాడు గాడిద.. ఎదురుగా గోడపై కనిపిస్తూనే ఉంటుంది, కానీ మెల్లగా పనికానిచ్చేస్తాం.. ఇక్కడ వాహనాలు నిలపరాదు.. ఎదురుగా నోపార్కింగ్ బోర్డు ఉంటుంది.. కానీ బండిని ఆపేస్తుంటాం.. ఎక్కడ ఏదైతే చేయకూడదు అని ఉంటుందో.. అక్కడ ఆ పని చేయడమే.. సగటు తెలుగు వ్యక్తి నైజంగా మారిపోతోంది. ఇలాంటి ధోరణికి పొడాలి చరమగీతం అంటే.. అంతకుమించిన క్రియేటివిటీ అవసరం. రూల్స్, జరిమానాలు విధించినా మనోళ్లు లెక్కచేసే రకం కాదు.. అందుకే ఓ జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్ మహేందర్ సరికొత్త దారిని ఎంచుకున్నాడు.. అదే గాంధీగిరి..

**పరిశుభ్రత కోసం:**

మహానగరం మేల్కొనకముందే.. తొలి కోడి కూయకుముందే.. చేతిలో చీపురుతో నగరాన్ని సుందరంగా మార్చే పనిలో నిమగ్నమవుతుంటారు జీహెచ్ఎంసీ పారిశుద్ధ సిబ్బంది. సూర్యోదయం కంటే ముందే రంగంలోకి దిగి.. నిన్నటి చెత్తాచెదారపు జ్ఞాపకాలను చీపురుతో ఊడ్చేసి.. ఉషోదయానికల్లా భాగ్యనగరాన్ని సరికొత్తగా ముస్తాబు చేస్తుంటారు. పండుగలు, పబ్బాలు.. వారాలు, రుతువులతో వారికి సంబంధం లేదు. హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచటమే వారి విధి. అయితే జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది.. పరిశుభ్రత కోసం ఇంతలా పనిచేస్తుంటే.. కొంతమంది మాత్రం నడిరోడ్డుపై, ఎక్కడబడితే అక్కడ చెత్తను పారవేస్తుంటారు.

**వినూత్న పంథా :**

కొంతదూరం వెళ్తే చెత్త కుండీలు ఉన్నప్పటికీ.. జీహెచ్ఎంసీ సిబ్బంది ఇంటింటా చెత్త సేకరణ జరుపుతున్నప్పటికీ.. తమ నైజాన్ని మాత్రం మార్చుకోరు. ఇలాంటి వారిలో మార్పు తెచ్చేందుకు జీహెచ్ఎంసీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న మహేందర్ వినూత్న పంథాను ఎంచుకున్నారు. తెల్లవారుజామున రోడ్డుపై నిలబడి.. రహదారిపై చెత్త వేయవద్దంటూ ప్రజలను వేడుకున్నారు. కాళ్లకు దండం పెట్టి మరీ విజ్ఞప్తి చేశారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# అందంగా...ఆరోగ్యం గుల్ల

**ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లలో నకిలీ అల్లం పేస్ట్**
**భారీగా కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ పట్టివేత**
**రూ. 22 లక్షల సామాగ్రి స్వాధీనం..**

హైదరాబాద్,మార్చి31(మనం న్యూస్): హైదరాబాద్ ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ కల్తీ దందాను కొనసాగిస్తున్న ముఠాపై హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు విరుచుకుపడ్డారు. నగర శివారులోని కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రాన్ని మంగళవారం అధికారులు ఛేదించారు.విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ టీం కాటేదాన్‌లోని సదరు తయారీ యూనిట్‌పై మెరుపు దాడులు నిర్వహించింది. అక్కడ నాసిరకం అల్లం, వెల్లుల్లితో పాటు ప్రమాదకరమైన రసాయనాలు, రంగులు కలిపి పేస్టును తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కల్తీ పదార్థాలను ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లలో నింపి మార్కెట్‌లోకి సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది.

**రూ. 22 లక్షల సామాగ్రి స్వాధీనం:**

ఈ దాడుల్లో సుమారు రూ. 22 లక్షల విలువైన కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్, ముడి పదార్థాలు, తయారీకి ఉపయోగించే యంత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



పారిశుద్ధ్యం లేని వాతావరణంలో, కుళ్ళిపోయిన పదార్థాలను వాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న తీరును చూసి అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. ఈ కల్తీ దందాకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న హసన్ రూపానీని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడు గత కొంతకాలంగా ఈ అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నిందితుడిని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించి, కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. 'కల్తీ పదార్థాలను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆడుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామనీ,నగరవ్యాప్తంగా ఇలాంటి తయారీ కేంద్రాలపై నిఘా కొనసాగుతుంది' అని టాస్క్ ఫోర్స్ అధికారులు హెచ్చరించారు.

# 'అమ్మ' ఇంటికి తాళం


**వేదనగా 'వేదనిలయం'**
**రూ. 83 లక్షల మేర ఇంటి పన్ను**
**జయలలిత ఇంటిని సీజ్ చేసిన జీహెచ్ఎంసీ అధికారులు**



హైదరాబాద్,మార్చి31(మనంన్యూస్): తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి, 'అమ్మ' జయలలితకు చెందిన హైదరాబాద్ నివాసాన్ని 'వేదనిలయం' గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సీజ్ చేశారు. నగరంలోని సంపన్న ప్రాంతమైన శ్రీనగర్ కాలనీలో ఉన్న ఈ ఇంటికి సంబంధించి భారీగా ఆస్తి పన్ను బకాయిలు ఉండటంతో అధికారులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. గడిచిన కొంతకాలంగా ఈ నివాసానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లించలేదని సమాచారం. బకాయిల చెల్లింపుపై ముందస్తు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఎటువంటి స్పందన లేకపోవడంతో జీహెచ్ఎంసీ రెవెన్యూ విభాగం అధికారులు మంగళవారం ఉదయం అక్కడికి చేరుకుని ఇంటిని సీజ్ చేసి, ప్రధాన ద్వారానికి తాళం వేసి, నోటీసును అంటించారు. రూ. 83 లక్షల మేర ఇంటి పన్ను చెల్లించకపోవడంతో జీహెచ్ఎంసీ అధికారులు ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

**చెరగని ముద్ర :**

సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి, తమిళనాడు ముఖ్యమంత్రిగా చెరగని ముద్ర వేసిన జయలలితను ప్రజలు 'పురట్చి తలైవి', 'అమ్మ' అని ఆప్యాయంగా పిలుచుకుంటారు. ఆమె మరణించే సమయానికి కూడా సీఎంగానే బాధ్యతలు నిర్వర్తించారు. జయలలితకు దేశవ్యాప్తంగా పలుచోట్ల విలువైన ఆస్తులు ఉన్న విషయం తెలిసిందే.గతంలో ఆమెపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.



ఆ కేసు విచారణలో భాగంగా స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు, ఆస్తుల పత్రాలను అధికారులు ఇప్పటికే ట్రంకు పెట్టెల్లో భద్రపరిచి తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించారు. తాజాగా హైదరాబాద్‌లోని నివాసానికి సంబంధించిన పన్నులు చెల్లించకపోవడంతో జీహెచ్ఎంసీ రెవెన్యూ విభాగం అధికారులు అధికారులు సీజ్ ప్రక్రియను పూర్తి చేశారు.

**చారిత్రక నేపథ్యం :**

జయలలిత తన సినిమా కెరీర్ ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడు, అలాగే రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా హైదరాబాద్‌లోని వేదనిలయంలో తరచూ గడిపేవారు. ఆమెకు ఇష్టమైన నివాసాల్లో ఇది ఒకటిగా పేరుంది. అయితే, ఆమె మరణం తర్వాత ఈ ఆస్తి వారసత్వ గొడవలు, ఇతర కారణాల వల్ల పర్యవేక్షణ కరువైందని, అందుకే పన్ను బకాయిలు పెరిగిపోయాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపు (మార్చి 31) కావడంతో, నగరవ్యాప్తంగా భారీగా బకాయిలు ఉన్న ఆస్తులపై జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రముఖుల ఇళ్లు అని చూడకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పష్టం చేశారు.

# దాతల పైసలు....పేదలకోసం

**పేద ప్రజలకు అందుబాటులో క్యాన్సర్ చికిత్స**
**రోగులకు త్వరితగతిన చికిత్స అందించటమే మా లక్ష్యం**
**ఏపి టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ**





హైదరాబాద్,మార్చి31(మనం న్యూస్): పేద ప్రజలకు క్యాన్సర్ చికిత్సను అందుబాటులోకి తీసుకురావడమే తమ ఆశయమని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. హైదరాబాద్ లోని బసవతారకం ఆసుపత్రిలో అడ్వాన్స్డ్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రంతో పాటు కొత్త అంబులెన్స్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత్ డైనమిక్స్ లిమిటెడ్ తమ సీఎస్ఆర్ నిధుల కింద విరాళంగా ఇచ్చిన ఈ అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం విశిష్టతను బాలకృష్ణ వివరించారు. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో పనిచేస్తుందని తెలిపారు. అతి తక్కువ సమయంలోనే స్కానింగ్ పూర్తి చేసి,అత్యంత కచ్చితమైన ఫలితాలను అందిస్తుందని వెల్లడించారు. దీనివల్ల రోగులకు త్వరితగతిన చికిత్స అందించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.





**ఏపీలోనూ:**

మరోవైపు, అమరావతిలో బసవతారకం ఆసుపత్రి నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించిన సంగతి తెలిసిందే. దీని గురించి బాలకృష్ణ మాట్లాడుతూ... అమరావతి పరిధిలోని తుళ్లూరులో మరో వారం రోజుల్లో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణ పనులను ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఈ ఆసుపత్రి వల్ల ఏపీలోని క్యాన్సర్ బాధితులకు స్థానికంగానే మెరుగైన వైద్యం అందుతుందని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు, పారిశ్రామికవేత్తలు, దాతల సహకారం వల్లే బసవతారకం ఆసుపత్రి నేడు ఈ స్థాయికి చేరుకుందని బాలకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. దాతలు ఇచ్చే ప్రతి రూపాయిని పేదల వైద్యం కోసమే వినియోగిస్తున్నామని స్పష్టం చేశారు.

# ఏందిరయ్యా... ఇదీ...

**బైక్ స్టంట్లతో యువకుల ఓవర్ యాక్షన్**
**పోలీసుల ముందే ప్రమాదకరంగా విన్యాసాలు**
**నిబంధనలను గాలికి వదిలి ఫోన్‌లో చిత్రీకరణ**
**వెంటాడి పట్టుకున్న పోలీసులు**
**పిచ్చి పనులు చేస్తే కఠినచర్యలు తప్పవు**
**పోలీసుల హెచ్చరిక**




హైదరాబాద్,మార్చి31(మనం న్యూస్): నగరంలో బైక్ స్టంట్లు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకోవడమే కాకుండా, సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే పోకిరీల ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయి. తాజాగా అత్తాపూర్ ప్రధాన రహదారిపై కొందరు యువకులు ఏకంగా పోలీసుల ముందే ప్రమాదకర విన్యాసాలు చేస్తూ రెచ్చిపోయారు. అయితే, వారి 'ఓవరాక్షన్'ఎంతోసేపు సాగలేదు.

వివరాల్లోకి వెళితే.. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసుల కళ్ళ ముందే కొందరు యువకులు బైక్లపై వేగంగాదూసుకువచ్చారు. హెల్మెట్లు లేకుండా, ట్రాఫిక్ నిబంధనలను గాలికొదిలేసి ఒకే బైక్‌పై ప్రమాదకరంగా వెళుతూ స్టంట్లు చేయడం ప్రారంభించారు. ఇంతటితో ఆగకుండా, తమ సాహసాలను మొబైల్ ఫోన్‌లో చిత్రీకరిస్తూ పోలీసులనే సవాల్ చేసేలా ప్రవర్తించారు.

**వెంటాడి పట్టుకున్న పోలీసులు:**

పోలీసుల సమక్షంలోనే ఇంతటి తెగింపు ప్రదర్శించడంతో అత్తాపూర్ పోలీసులు తక్షణమే అప్రమత్తమయ్యారు. నిబంధనలు ఉల్లంఘించి పారిపోవడానికి ప్రయత్నించిన ఆ యువకులను పోలీసులు సినిమా ఫక్కీలో వెంబడించారు. ఎట్టకేలకు వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన యువకులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వాహనాలను సీజ్ చేయడంతో పాటు, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. 'రోడ్లపై స్టంట్లు చేస్తూ ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తే సహించేది లేదు. సోషల్ మీడియా రీల్స్ కోసం ఇలాంటి పిచ్చి పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవు' అని పోలీసులు హెచ్చరించారు.

## 108 సేవలు అదుర్స్

మేడ్చల్, మార్చి 31 ( మనం జిల్లా ప్రతినిధి): పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణీకి ఇంటి దగ్గరే పురుడు పోసి శభాష్ అనిపించుకున్నారు.108 అంబులెన్స్ సిబ్బంది. మేడ్చల్ సర్కిల్ పరిధిలోని మునీరాబాద్ కు చెందిన ఆర్తి కుమారి కి పురిటి నొప్పులు అధికం కావడం తో 108 అంబులెన్స్ కు ఫోన్ చేశారు. అంబులెన్స్ ఫైలెట్ అశోక్, ఈఎంటి సీతారాం



హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నప్పటికీ ఆర్తి కుమార్ కి నొప్పులు అధికం అవడంతో ఇంటి వద్దనే పురుడు పోశారు. మునీరాబాద్ కు చెందిన ఆర్తి కుమారి (22) పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108 అంబులెన్స్ కు ఫోన్ చేయగా 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి సీతారాం పైలట్ అశోక్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆర్తి కుమారికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో ఆర్ సి పీ డాక్టర్ స్మిత సూచనల మేరకు ఇంటి వద్దనే పురుడు పోశారు. ఆర్తి కుమారి పండింటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.




## బోరు మోటర్‌కు మరమ్మత్తులు చేయించిన గాదం వేణు యాదవ్

**అభినందించిన పలువురు గ్రామస్తులు**

మేడ్చల్, మార్చి 31 ( మనం జిల్లా ప్రతినిధి ):: మేడ్చల్ సర్కిల్ పరిధి పూడూరు- కిష్టాపూర్ డివిజన్ లోని పూడూరులో గల మజీద్ వద్ద ఉన్న బోరు చెడిపోయింది.దీంతో గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు,బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గాదం వేణు యాదవ్ మంగళవారం తన సొంత ఖర్చులతో బోరుకు మరమ్మత్తులు చేయించి నీటి సమస్యను పరిష్కరించాడు.సొంత ఖర్చులతో బోరుకు మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించిన గాదం వేణు యాదవ్ ను పలువురు గ్రామస్తులు అభినందించారు.ఈ సందర్భంగా వేణు యాదవ్ మాట్లాడుతూ గ్రామంలోని మరో స్థలంలో కూడా చెడిపోయి ఉన్న బోరుకు మరమ్మత్తులు చేయించి అందుబాటులోకి తీసుకొస్తానని తెలిపారు.వేసవికాలంలో గ్రామస్తులు ఎవ్వరూ కూడా మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడవద్దు అనే ఉద్దేశంతోనే బోర్లకు మరమ్మత్తులు చేయిస్తున్నట్లుగా తెలియజేశారు.మిషన్ భగీరథ మంచినీరు రానప్పుడు ఈ బోరు మోటర్లు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీరాములు, జీ.నర్సింహ,తులసి శ్రీనివాస్,దేవేందర్,మండల సాయిబాబు గౌడ్,మోహీన్ ఖాన్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నగర్లో ఇందిరమ్మ క్యాంటీన్ కోసం కార్మికుల విజ్ఞప్తి..

**- జవహర్ నగర్ గడ్డ పేద ప్రజల అడ్డా..**
**- ఇందిరమ్మ భోజనం జవహర్ నగర్ పేద ప్రజలకు అందేనా? ..**




జవహర్ నగర్, మార్చి 31 (మనం న్యూస్): కీసర మున్సిపల్ సర్కిల్ లోని జవహర్ నగర్ ప్రాంతం కార్మికుల కోసం ఐదు రూపాయల భోజన పథకం కింద ఇందిరమ్మ క్యాంటీన్ ను జవహర్ నగర్ పాత మున్సిపల్ ఆఫీసు కార్మికుల అడ్డా వద్ద ఏర్పాటు చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చింతకింది అశోక్ కీసర మున్సిపల్ కమిషనర్ వసంతకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, జవహర్ నగర్ బాలాజీ నగర్ పరిధిలో రోజువారీ కూలి కోసం అడ్డాల వద్ద వేచి చూసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూలి దొరకని రోజుల్లో అనేక మంది కార్మికులు అర్ధాకలితోనే గడపాల్సి వస్తోందని, వారి జీవితం ఒక పూట భోజనంపైనే ఆధారపడి ఉందని పేర్కొన్నారు.

ప్రాంతంలో సుమారు 300 మందికి పైగా కార్మికులు ఉపాధి కోసం ప్రతిరోజూ అడ్డాల వద్ద చేరుతున్నారని, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరారు. గరీబోళ్లకు అండగా నిలిచేలా జవహర్ నగర్ గడ్డ నిలుస్తుందని ఆయన అన్నారు. వినతికి సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత, త్వరలోనే ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు కీసర మండల కార్యదర్శి నర్సింగ్ రావు, నాయకులు నగేష్, శివన్నారాయణ, కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## నేటి నుండి మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యం పంపిణీ

**జిల్లా మేనేజర్ సుగుణ బాయి**



మేడ్చల్, మార్చి 31 ( మనం జిల్లా ప్రతినిధి ): మెడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని రేషన్ కార్డు దారులకు మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనున్నట్లు జిల్లా మేనేజర్ ఎల్. సుగుణ బాయి తెలిపారు.జిల్లాకు సంబంధించి 6,45,442 రేషన్ కార్డులలో నమోదైన 22,17,063 లబ్దిదారులకు, ఒక్కొక్కరికి నెలకు 6 కిలోల చొప్పున మూడు నెలలకు అవసరమైన మొత్తం 39,360,154 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

జిల్లాలోని 6 ఎంఎల్ఎస్ ( ఎం ఎల్ ఎస్ ) పాయింట్ల ద్వారా బియ్యాన్ని ఫెయిర్ ప్రైస్ షాపులకు సరఫరా చేసి, అక్కడి నుండి లబ్దిదారులకు సకాలంలో పంపిణీ చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టామని తెలిపారు.లబ్దిదారులు ఏప్రిల్ 1వ తేదీ నుండి తమకు సంబంధించిన ఫెయిర్ ప్రైస్ షాపుల ద్వారా ఒకేసారి మూడు నెలల బియ్యాన్ని పొందవచ్చన్నారు.రేషన్ కార్డు, ఆధార్ వివరాలతో హాజరై బియ్యాన్ని సులభంగా పొందాలని సూచించారు.

పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ చర్యలు అమలు చేయబడుతున్నాయన్నారు.

అదేవిధంగా, ఎక్కడైనా అక్రమాలు, అదనపు వసూళ్లు లేదా ఇతర సమస్యలు తలెత్తిన పక్షంలో సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని ప్రజలను కోరారు.





## మేడ్చల్ బస్ డిపోలో మహిళలకు సన్మానం


మేడ్చల్, మార్చి 31 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ బస్టాండ్ లో మహాలక్ష్మి స్కీం ద్వారా పది కోట్ల రూపాయలను ఆదా చేసిన మహిళలను సన్మానించారు. నిత్య ప్రయాణిస్తున్న మహిళలను ఆహ్వానించి సత్కరించారు. దీనిలో భాగంగా ఐదు మంది నిత్యం మేడ్చల్ డిపో బస్సులో ప్రయాణం చేసే మహిళలను కనుగొని వారిని శాల్వా, మొమెంటుతో సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా మహిళా మండలి అధ్యక్షురాలు ప్రేమలత పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి పెట్టిన సంక్షేమ పథకాల్లో ఇది చాలా గొప్ప సంక్షేమ పథకం అని దీని ద్వారా మహిళలు ఉపాధి సౌకర్యం ఎన్నో రకమైన ప్రయోజనాలు పొందుతున్నారని తెలిపారు. జ్యోతి, గౌరీ, అరుణ్ జ్యోతి, చంద్రిక, అభినయలను ఆర్టీసీ సేవలను నిత్యం ఉపయోగించినందుకు వారిని అభినందించారు. డిపో మేనేజర్ పరిమళ మాట్లాడుతూ మహాలక్ష్మి స్కీం ద్వారా మహిళలే కాకుండా ఆర్టీసీ కూడా లాభాల్లోకి వస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డిపో మేనేజర్ పరిమళ, అసిస్టెంట్ మేనేజర్ రామారావు, అసిస్టెంట్ ఇంజనీర్ స్నేహలత, ఆఫీస్ సూపర్నెంట్ సత్యనారాయణ, సూపర్నెంట్ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యమిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**దళితమిత్ర యువజన సంఘం ఇంచార్జ్ శివగాళ్ల విజయ్ కుమార్**

**ఉపాధ్యక్షులు పానుగంటి ప్రవీణ్ ఆర్థిక సహాయం**

చేవెళ్ల,మార్చి 31(మనం న్యూస్): అకాల మరణం పొందిన చిరకాల స్నేహితుని కుటుంబానికి అండగా మేమున్నామంటూ ముందుకువచ్చి మైత్రి అన్న మాటకు సరైన నిర్వచనాన్ని అందించారు సాటి పూర్వ విద్యార్థి మిత్రులు. మానసిక ఒత్తిడితో ఇటీవల అల్లావాడ గ్రామానికి చెందిన శివగాళ్ల యాదయ్య ఆత్మహత్యకు పాల్పడి అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న 2011-12 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు



తమవంతుగా బాల్యమిత్రుని కుటుంబానికి అండగా నిలవాలని సంకల్పించారు. రూ.12,500 సేకరించిన నగదును మంగళ వారం మృతుని దశదినకర్మ రోజు మృతుని తల్లి నీలమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దళితమిత్ర యువజన సంఘం గ్రామ ఇంచార్జ్ శివగాళ్ల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు పానుగంటి ప్రవీణ్ శివగాళ్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్లవాడ గ్రామ 5వ వార్డ్ మెంబర్ శివగల్ల సత్యానందం తదితరులు పాల్గొన్నారు.




# రక్తాదానం చేయండి.... ప్రాణాలను కాపాడండి

**ఘణంగా బృహత్ స్వచ్ఛంద రక్తదాన శిభిరం**

**ప్రభుత్వ దంత వైద్యశాల,కళాశాల,ప్రిన్సిపాల్ డాక్టర్ సర్జీవ్ సింగ్ యాదవ్**



హైదరాబాద్,మార్చి31(మనం న్యూస్)ః హైదరాబాద్‌లోని ప్రభుత్వ దంత వైద్యశాల,కళాశాలలో, ఉస్మానియా జనరల్ హాస్పిటల్ బ్లడ్ సెంటర్ సహకారంతో 'రక్తాన్ని దానం చేయండి - ప్రాణాలను కాపాడండి' అనే స్ఫూర్తిదాయక నినాదంతో మంగళవారం బృహత్ స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరాన్ని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ కుమార్ సహాయ్, ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సర్జీవ్ సింగ్ యాదవ్ లు ప్రారంభించారు. డాక్టర్ సర్జీవ్ సింగ్ యాదవ్ ఇప్పటివరకు తన జీవితంలో 107 సార్లు రక్తదానం చేసి, విద్యార్థులకు మరియు సమాజానికి ఆదర్శంగా నిలిచారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ (అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ జె. చందులాల్, వైస్ ప్రిన్సిపాల్ (అకాడమిక్) డాక్టర్ ఎస్. జగదీశ్వర్ రావు, ప్రొఫెసర్ డాక్టర్ శాంతిప్రియ, జి.డి.సి.హెచ్ ఆర్.ఎం.ఓ డాక్టర్ దయానందం పాల్గొన్నారు. వీరితో పాటు ఉస్మానియా జనరల్ హాస్పిటల్ పరిపాలనా బృందం నుండి ఆర్.ఎం.ఓ-1 డాక్టర్ జయకృష్ణ, డిప్యూటీ ఆర్.ఎం.ఓ డాక్టర్ శంకర్, బ్లడ్ సెంటర్ ఇన్-ఛార్జ్ డాక్టర్ సిద్ధిఖీ, డాక్టర్ విజయ్ భాస్కర్, డాక్టర్ అన్వేష్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బ్లడ్ సెంటర్ బృంద సభ్యులు డాక్టర్ విద్యాజ్యోతి (సీనియర్ రెసిడెంట్, పాథాలజీ), డాక్టర్ అన్వేష్, కౌన్సిలర్లు వి. శ్రీలత,ఎ. జయ, అలాగే సహాయక సిబ్బంది రంగ, శ్రీనివాస్ రెడ్డి, నగేష్, ముఖేష్,జానయ్యలతో పాటు ఈ శిబిరంలో ఫ్యాకల్టీ సభ్యులు, సీనియర్ రెసిడెంట్లు, పీజీ, యూజీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సుమారు 85 మంది దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయడం వారి సామాజిక స్పృహను,మానవతా దృక్పథాన్ని చాటిచెప్పింది.

**ప్రాముఖ్యతః**

ఈ కార్యక్రమం ఉస్మానియా జనరల్ హాస్పిటల్ రక్త నిల్వలను బలోపేతం చేయడమే కాకుండా, దానం చేసే ప్రతి రక్తపు చుక్క ఒకరి ప్రాణాన్ని కాపాడుతుందని గుర్తుచేసింది. క్రమం తప్పకుండా స్వచ్ఛంద రక్తదానం చేయడంలోని ప్రాముఖ్యతను ఈ వేడుక నొక్కిచెప్పింది మరియు యువ వైద్య నిపుణులను సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని ప్రేరేపించింది.ప్రజారోగ్యం పట్ల కరుణ, సేవ,సామూహిక బాధ్యతాయుతమైన సంస్కృతిని నిర్మించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.








# కదం తొక్కిన ఆశా వర్కర్లు





**జాతీయ రహదారిపై రాస్తారోకో**

**సీఎం దిష్టిబొమ్మ దహనం**

మేడ్చల్, మార్చి 31 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ జాతీయ రహదారి పైన సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో చేసి తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం ను దహనం చేశారు.

ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి ఎం .నరేష్ మాట్లాడుతూ ఈ నెల 28న తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపును ఇవ్వడం జరిగిందని చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఒకరోజు ముందే ఆశ వర్కర్లని, నాయకులని అరెస్టు చేసి దిగ్బంధం చేశారని తెలిపారు ఈ చర్యను ఖండిస్తూ మేడ్చల్ హైవే పైన రాస్తారోకో నిర్వహించామని అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ లతోపాటు, 7వ హామీగాప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని హామీ ఇచ్చిందని, కానీ ప్రజాస్వామ్య పరిరక్షణలో దారుణంగా విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆశా కార్యకర్తలకు రూ.18 వేల రూపాయల ఫిక్స్డ్ వేతనం ఇస్తామన్నా హామీనీ అమలు చేయమని ప్రశ్నిస్తే ఆశా కార్యకర్తలపై అత్యంత నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన ఆశలపై, రాష్ట్ర జిల్లా నాయకులపై లాఠీచార్జ్ చేయడమే కాకుండా రాత్రి వరకు ఆడపడుచులను పోలీస్ స్టేషన్లో పెట్టి నిర్బంధించిందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తామని ఏడవ హామీగా చెప్పిన కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కిందని విమర్శించారు. కార్మిక వర్గ పోరాటాల పట్ల బాధ్యతరహితంగా వ్యవహరించిన ఏ ప్రభుత్వము మనుగడ సాధించిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను



అమలు చేయమని అడిగితే ఆశా కార్యకర్తల ఇళ్ల దగ్గరికి వచ్చి అక్రమంగా అరెస్టులు చేయడమే కాకుండా మంచినీళ్లు కూడా ఇవ్వకుండా పోలీస్ స్టేషన్లల్లో నిర్బంధించారని విమర్శించారు. తమను విస్మరించి తమ పోరాటాలను అణచివేసిన గత ప్రభుత్వానికి ఏ గతి పట్టిందో గుర్తు చేసుకోవాలని హెచ్చరించారు. ఆశా వర్కర్స్ కి ఫిక్స్డ్ వేతనం రూ.18000/- ఇవ్వాలని, అదనపు పని భారాలు తగ్గించాలని, మట్టి ఖర్చులకు రూ.50,000, ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు చెల్లించేంత వరకు తమ పోరాటం ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు పద్మ, వసంత, మండల నాయకులు కృష్ణవేణి, కల్పనా, ఫైనాస్, మాదవి, లక్ష్మి, యాదమ్మ, అతీయ, రేణుక, శ్రీదేవి, సునీత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత నీటి సమస్యలను పరిష్కారించాలి

సికింద్రాబాద్, మార్చి 31 (మనం న్యూస్) ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ పరిష్కారానికి కృషి చేస్తామని మరోసారి నిరూపించారు మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్. అమీర్పేట డివిజన్లోని బీజేఆర్ నగర్ ప్రాంతంలో కలుషిత నీరు సరఫరా అవుతున్నదని, అలాగే 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో తగినంత నీటి సరఫరా లేక రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేను కలిసి సమస్యలను వివరించారు. అదే సందర్భంగా ఏప్రిల్ 2న జరగనున్న హనుమాన్ జయంతి కార్యక్రమానికి ఆహ్వాన పత్రికను అందజేశారు. సమస్యలను విన్న ఎమ్మెల్యే తక్షణమే అమీర్పేట సర్కిల్ వాటర్ వర్క్స్ అధికారి సతీష్ కుమార్తో ఫోన్లో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం సరఫరా చేస్తున్న ఒక ట్యాంక్ నీరు సరిపోవడం లేదని గుర్తించి, రోజుకు రెండు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా బీజేఆర్ నగర్లో కలుషిత నీటి సమస్యకు గల కారణాలను గుర్తించి వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, కూతురు నర్సింహ, కట్టా బలరాం తదితరులు పాల్గొన్నారు.



## మంజూరైన పనులు త్వరలో పూర్తి చేస్తాం

**మాజీ కార్పొరేటర్ శాంతి**

సికింద్రాబాద్, మార్చి 31 (మనం న్యూస్) వీవీస్టీ కాలనీ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తెలిపారు. మంజూరైన సుమారు రూ.14 కోట్ల అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభమై పూర్తి అయ్యేలా కృషి చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని వివిస్టీ కాలనీలోని అమ్మవారి గుడి ముందు వీధి, సమీప వీధుల్లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్ల పనులను ఆమె పరిశీలించారు. రెండు సంవత్సరాల క్రితం ఈ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనా, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పనులు నిలిచిపోయి నిధులు వెనక్కి వెళ్లిపోయాయని గుర్తు చేశారు. తరువాత ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో తిరిగి నిధులు సమీకరించి, సుమారు రూ.10 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేయించారని తెలిపారు. అనంతరం ప్రస్తుతం రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కారం కావడంతో స్థానిక బస్తీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ మాజీ కార్పొరేటర్ శాంతిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, సువర్ణ సుగుణాకర్ రావు, రోహిత్, శ్రీనివాస్ రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి

**డా. చలమల్ల వెంకటేశ్వర్లు**

**జహీరాబాద్లో హెచ్ఐవి ఎస్ టి ఐ అవగాహన ర్యాలీ విజయవంతం..**




సికింద్రాబాద్, మార్చి 31 (మనం న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ ఎస్ ఎస్ సెల్ ఆధ్వర్యంలో, జహీరాబాద్లోని ఆచార్య డిగ్రీ కాలేజీ సహకారంతో జిల్లా స్థాయి రెడ్ రిబ్బన్ క్లబ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెచ్ ఐ వి ఎస్ టి ఐ నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు అవగాహన ర్యాలీ, సెమినార్ నిర్వహించారు. సెమినార్ కు ఆతిథ్య కళాశాల ప్రిన్సిపాల్ డా. చి. హరి కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. చలమల్ల వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హెచ్ ఐ వి, లైంగిక వ్యాధుల నివారణలో అవగాహన, విద్య అత్యంత ముఖ్యమన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి అని ఆయన అన్నారు. కాకతీయ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ పి. నర్సింహా రావు, రిసోర్స్ పర్సన్ భవాని విద్యార్థులకు హెచ్ ఐ వి ఎస్ టి ఐ వ్యాధుల నివారణ, జాగ్రత్తలు, యువత పాత్రపై సమగ్రంగా అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆరోగ్య రాయబారులుగా సమాజంలో చైతన్యం పెంచాలని సూచించారు. యువతలో సామాజిక బాధ్యత, ప్రజా ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తోందని నిర్వాహకులు తెలిపారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొనగా, సుమారు 350 మంది వాలంటీర్లు ఉత్సాహంగా హాజరయ్యారు.





## బౌద్ధ నగర్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

సికింద్రాబాద్, మార్చి 31 (మనం న్యూస్) వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బౌద్ధ నగర్లో మంగళవారం సాయంత్రం సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి, వాటి నుంచి ఎలా రక్షించుకోవాలి, మోసాలకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై వివరంగా తెలియజేశారు. ప్రత్యేకంగా, ఎవరైనా సైబర్ నేరానికి గురైనట్లయితే వెంటనే 1930 హెల్ప్లైన్ నంబర్కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. తక్షణ సమాచారంతో నష్టాన్ని తగ్గించుకోవచ్చని అధికారులు తెలిపారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ ఏసీపీ కె. శశాంక్ రెడ్డి, వారాసిగూడ ఇన్స్పెక్టర్ రాజేందర్ గౌడ్తో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఏప్రిల్ 2న హనుమాన్ విజయోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సికింద్రాబాద్, మార్చి 31 (మనం న్యూస్) ఏప్రిల్ 2 గురువారం జరిగే హనుమాన్ విజయోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లాలాపేట హిందు వాహిని సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు లాలాపేటలో పోచమ్మ దేవాలయం వద్ద స్థానిక అఖిలపక్ష నాయకులతో కలిసి గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా హిందూ వాహిని నాయకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించినట్టే ఈ సంవత్సరం కూడా హనుమాన్ విజయోత్సవ శోభయాత్రను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. హనుమంతుడు లంక వెళ్లి సీతమ్మను కలిసి అనంతరం లంక దహనం చేపట్టిన సందర్భంగా విజేత కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా జరుపుకోవడం జరుగుతుంది అని తెలిపారు. గురువారం ఉదయం లాలాపేట ఇసుక బావి నుండి హిందూ యువకులు బైక్ ర్యాలీ నిర్వహిస్తారని, సాయంత్రం లాలాపేట మైసమ్మ ఆలయం దర్వాజా కమాన్ నుండి లాలాపేట శాంతినగర్ లాలాగూడ తదితర ప్రాంతాలలో శోభయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం స్థానిక అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ హనుమాన్ విజయోత్సవ కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రతి ఊరిలో ఊరి పండుగగా జరుపుకుంటారని తెలిపారు. స్థానికంగా ఉన్న అఖిలపక్ష నాయకులు పార్టీలకు అతీతంగా ప్రజలతో కలిసి హనుమాన్ విజయోత్స కార్యక్రమాన్ని ఊరి పండుగగా జరుపుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని హిందూ బంధు, కుటుంబ సభ్యులు అందరూ పెద్ద ఎత్తున కార్యక్రమాలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లాలాపేట హిందూ వాహిని నాయకులు సాయి, జై శ్రీరామ్ అనిల్, విశాల్, ప్రదీప్ మహేష్, నాగరాజ్, కాశి, విమల్, సందీప్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్లలో మున్సిపల్ అభివృద్ధి పనుల తనిఖీ

**- 99 రోజుల ప్రణాళికపై ప్రత్యేక అధికారి సమీక్ష.**

చేవెళ్ల, మార్చి 31(మనం న్యూస్) : 99 రోజుల ప్రణాళికలో భాగంగా చేవెళ్ల మున్సిపల్ పరిధిలో మంగళవారం ప్రత్యేక అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీమతి పద్మావతి పర్యటించారు. పట్టణంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు, శానిటేషన్, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పట్టణ ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు (స్మశాన వాటికలు), వాటర్ ట్యాంకులు మరియు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని వసతులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని, 99 రోజుల లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీ వెంకటేశం, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# శ్మశానవాటిక స్థలంపై కన్ను

**పట్టించుకోని అధికారులు**
**కబ్జాకు గురవుతున్న స్థలం**
**శ్మశానవాటిక కు కేటాయించిన స్థలం పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్**




మేడ్చల్, మార్చి 31 ( మనం జిల్లా ప్రతినిధి): మేడ్చల్ సర్కిల్ గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని సుతారిగూడ లో శ్మశానవాటిక కు ప్రభుత్వం కేటాయించిన 24 గుంటల స్థలం పై భూ బకాసురుల కన్ను పడింది. ఇప్పటికే 24 గుంటల నుండి రెండు గుంటలను స్వాహా చేయగా ఇంకా 22 గుంటలపై కన్ను పడిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏ లక్ష్యంతో ప్రభుత్వం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించిందో ఆ లక్ష్యం నెరవేరకుండా అదే గ్రామానికి చెందిన అధికార పార్టీ బడా నేత అడ్డుకుంటున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో అధికారుల నిర్లక్ష్యం సైతం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి.

శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించి చేతులు దులుపుకోవడం వల్ల ప్రస్తుతం ఆ స్థలం నిరుపయోగంగా పడి ఉంది.అధికారులు ఎవరూ దీనిని పట్టించుకోకపోవడంతో భూ బకాసురుల దృష్టి ఈ ప్రభుత్వ భూమిపై పడింది.

**25 సర్వే నెంబర్లో 24 గుంటల కేటాయింపు**

సుతారిగూడ గ్రామానికి శ్మశానవాటిక కోసం సర్వేనెంబర్ 25 లో 24 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించింది. ఇందులో నుండి ఇప్పటికే నుండి రెండు గుంటల స్థలం కబ్జా గురైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుండ్ల పోచంపల్లి మున్సిపల్ గా ఉన్న సమయంలో శ్మశానవాటిక కోసం 25 సర్వే నెంబర్ లో 24 గుంటల స్థలాన్ని కేటాయించి చేతులు దులుపుకుంది. అప్పటినుంచి ఈ స్థలంలో శ్మశానవాటిక నిర్మాణ ఊసే ఎత్తడం మర్చిపోయారు. దీంతో గ్రామానికి శ్మశానవాటిక లేక రోడ్డుపైనే దహన సంస్కరణలు చేసుకునే దుస్థితి ఏర్పడింది.

**శ్మశానవాటిక ను అడ్డుకుంటున్న వ్యక్తిపై చర్యల కై డిమాండ్**

శ్మశానవాటిక ను అడ్డుకుంటున్న వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.శ్మశానవాటిక కోసం ప్రభుత్వ కేటాయించిన స్థలం పక్కనే సదరు వ్యక్తి వ్యవసాయ స్థలాలు ఉండడం శ్మశానవాటిక ఏర్పడితే తన వ్యవసాయ స్థల రేట్లు పడిపోతాయన్న దురుద్దేశంతో శ్మశానవాటిక ఏర్పాటును అడ్డుకుంటున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఒక వ్యక్తి స్వార్థం వల్ల గ్రామం మొత్తం ఇబ్బందులకు గురవుతుందని ఈ విషయంలో అధికారులు స్పందించి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో శ్మశానవాటిక ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. శ్మశానవాటిక కు కేటాయించిన స్థలంలో శ్మశానవాటిక ను ఏర్పాటు చేయకపోవడం.. కేటాయించిన 24 గుంటల స్థలంపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఈ స్థలం అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉందని, దీనిపై సమగ్ర విచారణ జరిపి కబ్జాకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## పేదింటి ఆడబిడ్డ పెళ్లి కానుకగా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత

(తలకొండపల్లి మార్చ్31/మనం న్యూస్) : తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో సామాజిక బాధ్యతతో ముందుకు వస్తున్న సర్పంచ్ ఎన్నికలలో (మేనుపెస్టులో భాగంగా)ఇచ్చిన మాట ప్రకారంగా రెండవ పథకం ఆడపడుచు అంజలి పెళ్లికి కానుకగా 10000 వేల రూపాయలు రాంపూర్ గ్రామ సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ ఇవ్వడం జరిగింది.

అదేవిధంగా గ్రామ ఉప సర్పంచ్ సప్పిడి ఆంజనేయులు ముదిరాజ్ 50 కేజీల బియ్యం, మాజీ సర్పంచ్ దుర్గపురం మన్నెమ్మ-యాదయ్య 50 కేజీల బియ్యం, మాజీ ఎంపిటిసి కటికెల భీమమ్మ-యాదయ్య 50 కేజీల బియ్యం అందజేయడం జరిగింది

₹ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ యెన్నం మోహన్ రెడ్డి ,మాజీ టెంపుల్ చైర్మన్ సప్పిడి జానయ్య ,వార్డు సభ్యులు సునీత-కృష్ణయ్య,దొరిబాయి లాలమ్మ-జంగయ్య,కటికల మధు యాదవ్,కాకి రాము,మాజీ వార్డు సభ్యులు: మీసాల ఆంజనేయులు టిఆర్ఎస్, నాయకులు,షర్ఫుద్దీన్, సలీం,పాండు రెడ్డి, ముక్కాల నరసింహ,బాలయ్య, కాజామియా,సామెల్, యువ నాయకులు,యాదయ్య,శేఖర్,బోదాస్ నరసింహ,శ్రీశైలం,మహేష్ యాదవ్, చిన్నయ్య,మహేష్,సప్పిడి మహేష్, శివ,పాల్గొన్నారు.

## వెల్జాల్ చలివేంద్రం దగ్గర రాగి అంబలి పంపిణీ

(తలకొండపల్లి (మార్చి31/మనం న్యూస్): తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలోని ప్రధాన రహదారిపై తిరుమణి రాఘవేందర్ గౌడ్ ఏర్పాటు చేసిన చలివేంద్రం దగ్గర తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ అవ్వరి మహేష్ వేసవి కాలం ప్రజల దాహార్తి తీర్చడానికి బాటసారిలకు వాహనం దారులకు రాగి అంబలి పంపిణీ అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ వెల్జాల్ గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన రాఘవేంద్ర గౌడ్ కు ప్రత్యేక ధన్యవాదాలు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దహార్తిని తీర్చడానికి మంచి ఆలోచనతో ఏర్పాటుచేసిన చలివేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామంలోని ఎస్ బి ఐ బ్యాంకు దగ్గరికి వచ్చిన ప్రజలు చల్లటి నీరు, మాజీగా, అంబలి తాగి వారి దాహార్తిని తీర్చుకుంటున్నారు.గ్రామంలో గెలిచిన ఓడిన ప్రజా అవసరాలను తీర్చడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తిరుమణి రాఘవేందర్ గౌడ్,వార్డు సభ్యులు గోదా శ్రీరామ్,సుభాన్,అయిల్ సాయి కుమార్, శ్రీశైలం గౌడ్,విజయ్ యాదవ్, ఆరిఫ్,చింతకాయల రాము,అయిల్ రాఘవేందర్ గౌడ్,చంద్ర శేఖర్, మహేష్, పవన్, మణికంఠ, రవి గౌడ్, సుధాకర్, షఫీ, నరేష్, సాయి,గ్రామస్తులు, మహిళాలు యువకులు తదితరులు పాల్గొన్నారు.






# హైవేపై అక్రమ షెడ్ ఎవరు అడ్డుకోరు?



**కండ్లకోయలో నిబంధనలకు నీళ్లు**

**అధికారుల మౌనం చర్చనీయాంశం**

మేడ్చల్, మార్చి 31 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ జిహెచ్ఎంసి పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్లో కండ్లకోయ హైవేపై అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్ వివాదానికి దారితీస్తోంది. నిబంధనలను పక్కనబెట్టి, ఎలాంటి అనుమతులు లేకుండానే హైవే పక్కన బహిరంగంగా నిర్మాణ పనులు కొనసాగుతుండటం స్థానికుల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది.

ప్రధాన రహదారికి అతి సమీపంలోనే నిర్మాణం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇది సాధారణ ప్రజల పని అయితే ఇప్పటికి కఠిన చర్యలు తీసుకునేవారు మరి ఇక్కడ ఎందుకు నిర్లక్ష్యం? అని స్థానికులు నిలదీస్తున్నారు.

అనుమతులు లేకుండా ఇలాంటి నిర్మాణాలు కొనసాగడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, ఇది భవిష్యత్తులో మరిన్ని అక్రమ నిర్మాణాలకు మార్గం సుగమం చేసే ప్రమాదం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. నియంత్రణ లేకుండా కొనసాగితే పట్టణ అభివృద్ధి క్రమశిక్షణకు గండిపడే అవకాశముందని వారు హెచ్చరిస్తున్నారు.

హైవే పక్కనే నిర్మాణం సాగుతున్నా తనిఖీలు జరగకపోవడం, ఎలాంటి నోటీసులు ఇవ్వకపోవడం వంటి అంశాలు అధికార యంత్రాంగ పనితీరుపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. నియమాలు పుస్తకాలకే పరిమితమా? అమలు ఎక్కడ? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

స్థానికుల ఆరోపణల ప్రకారం, ఈ నిర్మాణం అనుమతులు లేకుండానే కొనసాగుతున్నప్పటికీ ఎవరూ అడ్డుకోవడంలేదు. ఇది అధికారుల నిర్లక్ష్యమా? లేక మరేదైనా ఒత్తిడుల ప్రభావమా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించి నిర్మాణాన్ని నిలిపివేసి, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కూల్చివేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో సమస్యను పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమంగా తీసుకెళ్తామని హెచ్చరిస్తున్నారు.



# ఓయూ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛ క్యాంపస్ డ్రైవ్

సికింద్రాబాద్, మార్చి 31 (మనం న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్వచ్ఛ క్యాంపస్ డ్రైవ్ను నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం, క్యాంపస్ను శుభ్రంగా, పచ్చగా ఉంచడం ప్రధాన లక్ష్యంగా ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్సీ వృక్షశాస్త్ర విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. వృక్షశాస్త్ర విభాగ భవనం నుంచి ప్రారంభమైన శుభ్రత కార్యక్రమం పరిసర ప్రాంతాలు, ముఖ్యంగా బొటానికల్ గార్డెన్ ప్రాంతం వరకు విస్తరించింది. దీంతో క్యాంపస్లో పరిశుభ్రమైన, పర్యావరణహిత వాతావరణం ఏర్పడింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో స్వచ్ఛతపై చైతన్యం పెంపొందించడమే కాకుండా, పర్యావరణ బాధ్యతపై అవగాహన కల్పించబడింది. సమాజ సేవా భావంతో పాటు సస్టైనబిలిటీ పట్ల విభాగం నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబించింది. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఏ. సబితా రాణి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ కె. శైలజ, ప్రొఫెసర్లు పి. కమలాకర్, బి. రమాదేవి, ఈ. సుజాత, డాక్టర్ ఎస్. నాగేశ్వరరావు, డాక్టర్ ఏ. విజయ భాస్కర్ రెడ్డి తదితరులు విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# గాంధీ ఆసుపత్రిలో అరుదైన క్లిష్ట శస్త్రచికిత్స విజయవంతం

సికింద్రాబాద్, మార్చి 31 (మనం న్యూస్) సికింద్రాబాద్లోని గాంధీ ఆసుపత్రిలో వైద్యులు మరోసారి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. 43 ఏళ్ల మహిళలో భారీ ప్లీహావృద్ధి (స్ప్లీన్ పెరగడం) తో పాటు ప్యాన్సైటోపీనియా వంటి క్లిష్ట సమస్యలతో బాధపడుతున్న రోగికి అత్యంత సవాలుగా నిలిచిన స్ప్లీనెక్టమీ (ప్లీహ తొలగింపు శస్త్రచికిత్స)ను విజయవంతంగా నిర్వహించారు. వారాసిగూడకు చెందిన ఈ మహిళ గత మూడు నెలలుగా కడుపునొప్పి, ఒక నెలగా కడుపు ఉబ్బరం సమస్యలతో ఆసుపత్రిని ఆశ్రయించారు. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో ఆమె ప్లీహ అసాధారణంగా పెరిగి నాభి కింద వరకు విస్తరించినట్లు గుర్తించారు. అల్ట్రాసౌండ్ పరీక్షల్లో ప్లీహ పరిమాణం సుమారు 19x 23 సెం.మీ.గా నమోదై, ఇది సాధారణ పరిమాణం కంటే చాలా ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. అదేవిధంగా రక్తంలో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, ప్లేట్లెట్స్ సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం (ప్యాన్సైటోపీనియా) పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. ఈ నేపథ్యంలో శస్త్రచికిత్స చేయడం వైద్య బృందానికి పెద్ద సవాలుగా మారింది. సీనియర్ సర్జన్ డా. సునీల్, అనస్థీషియా నిపుణుడు డా. మురళి ఆధ్వర్యంలోని బృందం సమగ్ర ప్రణాళికతో శస్త్రచికిత్స చేపట్టి విజయవంతంగా పూర్తి చేసింది. శస్త్రచికిత్స సమయంలో ప్లీహ పరిమాణం సుమారు 45x 20 సెం.మీ.గా ఉండగా, దాని బరువు సుమారు 2.8 కిలోల వరకు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ భారీ ప్లీహను సురక్షితంగా తొలగించడం వైద్య రంగంలో అరుదైన విజయంగా భావిస్తున్నారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతూ ప్రస్తుతం స్థిరంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సమయానికి సరైన చికిత్స అందితే రోగి కోలుకునే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని వారు తెలిపారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సకు అదనపు డీఎంఈ డా. వాణి, ఇన్చార్జ్ సూపరింటెండెంట్ డా. శోభ, ప్రిన్సిపాల్ డా. ఇందిరా అందించిన మద్దతుకు వైద్య బృందం కృతజ్ఞతలు తెలిపింది.





# తల్లి జ్ఞాపకార్థం అనాథలకు అన్నదానం

**- సమాజానికి సేవే నా బాధ్యత: పోతురాజు మల్లేష్**

చేవెళ్ల,మార్చి 31(మనం న్యూస్): సమాజానికి తోడ్పాటు అందించడం తన బాధ్యతగా భావిస్తున్నానని పోతురాజు మల్లేష్ అన్నారు. తల్లి సత్యమ్మ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద వార్డుకు చెందిన ఆయన మంగళవారం శంకర్పల్లి మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలోని వాల్మీకి గురుకులం ఆశ్రమంలో అనాథ పిల్లలకు భోజన విందు నిర్వహించారు. ముందుగా సత్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి వారిని స్మరించుకున్నారు. అనంతరం చిన్నారులకు స్వయంగా వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ప్రతి ఏడాది6 ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు. ఆశ్రమ నిర్వాహకుడు నాయుడు.. మల్లేష్ కుటుంబం సేవాభావాన్ని కొనియాడారు.

# బేకరిలపై ఎస్వోటీ పోలీసులు దాడి

**గడువు ముగిసిన రసాయనాలతో కేకులు తయారు చేస్తున్నట్లు గుర్తింపు**




మేడ్చల్, మార్చి 31 ( మనం జిల్లా ప్రతినిధి ): మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్థానిక ఓ బేకరిపై సోమవారం అర్ధరాత్రి ఎస్వోటీ పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో బేకరిలో గడువు ముగిసిన రసాయన పదార్థాలతో కేకులు, ఇతర బేకరీ ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.తనిఖీల సందర్భంగా కాలం చెల్లిపోయిన ఫ్లేవర్లు, కలర్ కెమికల్స్తో పాటు ఇతర ముడి పదార్థాలను భారీ మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. ఈ పదార్థాలతో తయారు చేసిన ఆహార పదార్థాలు ప్రజల ఆరోగ్యానికి హానికరమని పోలీసులు తెలిపారు. అదేవిధంగా, బేకరి వద్ద సరైన ఫుడ్ లైసెన్స్ కూడా లేకపోవడం గుర్తించారు.ఈ ఘటనపై బేకరి యజమానిపై కేసు నమోదు చేసి, సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు ప్రారంభించారు. ఇలాంటి ఘటనలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ, ఆహార భద్రత నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.



## మల్కాజిగిరి నగరపాలక సంస్థలో దోమల నివారణపై సమీక్షా సమావేశం



సికింద్రాబాద్, మార్చి 31 (మనం న్యూస్) తార్నాక లోని మల్కాజిగిరి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కాప్రా, నాచారం సర్కిళ్లకు చెందిన వార్డు ఎంటమాలజీ సూపర్వైజర్లతో ఎం.ఎం.సి కమిషనర్ వినయ్ క్రిష్ణారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సూపర్వైజర్లు ఉదయం హాజరు నమోదు నుండి రోజువారీ విధులు పూర్తయ్యే వరకు తీసుకుంటున్న చర్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. దోమల పెరుగుదలను అరికట్టేందుకు ప్రతి ఇంటిలో నిల్వ ఉన్న నీటిని తొలగించేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో కెమికల్ స్ప్రే నిర్వహణను సమర్థవంతంగా చేయాలని, యాంటీ లార్వా ఆపరేషన్లు మరియు ఫాగింగ్ కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. అలాగే చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించడం, గంబూసియా చేపలను వదలడం వంటి చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు. పరిశుభ్రత, ప్రజల సహకారం ద్వారా మాత్రమే దోమల సమస్యను పూర్తిగా నియంత్రించవచ్చని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ ఎంటమాలజిస్టు మాధవరెడ్డి, నాచారం డిప్యూటీ కమిషనర్ నిత్యానందం, కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకంతో 290 కోట్ల ఉచిత ప్రయాణాలు

**మహిళలకు 10 వేల కోట్ల ఆదా..**

సికింద్రాబాద్, మార్చి 31 (మనం న్యూస్) రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు 290 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు చేసి సుమారు 10 వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా ఆర్టీసీ సంస్థ సికింద్రాబాద్ లోని జూబ్లీ బస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న మహిళలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని



మహిళా ప్రయాణికులను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన 24 గంటల్లోనే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసినట్లు పేర్కొన్నారు. మహిళల దీవెనలతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, వారి సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కోటి మంది మహిళలను ఆర్థికంగా బలపర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలు ఆర్థికంగా లాభపడటమే కాకుండా, భవిష్యత్తులో ఆర్టీసీకి బస్సులు అద్దెకు ఇచ్చే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఎక్కువగా మహిళల పేరుతోనే ప్రారంభమవుతున్నాయని, ఉచిత ప్రయాణ సదుపాయాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీలత, డిప్యూటీ రీజనల్ మేనేజర్ సరస్వతి, డిపో మేనేజర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# జస్ట్ డయల్ పేరిట మోసం..

**నిందితుడిని అరెస్టు చేసిన మార్కెట్ పోలీసులు..**



సికింద్రాబాద్, మార్చి31 (మనం న్యూస్) మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోషల్ మీడియా ద్వారా మోసాలకు పాల్పడుతున్న సంఘటన చోటుచేసుకుంది. సోషల్ మీడియా, ఫోన్ కాల్స్ ద్వారా వేధింపులు చేసి అదనపు డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని మార్కెట్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన ముదిరాజ్ వన్నూరు స్వామి అలియాస్ అంజి కిరణ్ అలియాస్ అభి (34), ఉపాధి కోసం నగరానికి వచ్చి యూసఫ్ గూడ రహమత్ నగర్ లో నివాసముంటూ క్యాటరింగ్ కార్మికులను సరఫరా చేసే వ్యాపారం చేస్తున్నాడు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ప్లాన్ తో మొదట క్యాటరింగ్ సేవల పేరుతో అడ్వాన్స్ తీసుకుని, తర్వాత వివాదాలు సృష్టించి అదనపు డబ్బులు డిమాండ్ చేయడం జరిగింది. బాధితుల వ్యక్తిగత వివరాలను ఉపయోగించి సోషల్ మీడియా, ఫోన్ కాల్స్ ద్వారా వేధింపులు చేయడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నాడు. ఇదిలా ఉండగా సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి జస్ట్ డయల్ ద్వారా క్యాటరింగ్ కార్మికులను బుక్ చేసుకున్నారు. ముందుగా నిర్ణయించిన ధరలకు పని పూర్తి అయిన తర్వాత, నిందితుడు అదనపు డబ్బులు డిమాండ్ చేశాడు. ఫిర్యాదుదారు నిరాకరించడంతో,ఫోన్ ద్వారా అతడిని , కుటుంబ సభ్యులను దూషించడం ప్రారంభించాడు. నిందితుడు ఫిర్యాదుదారుని బంధువులకు కాల్స్ చేసి తప్పుడు సమాచారం పంపడం, ప్రమాదం జరిగినట్లు చెప్పడం వంటి చర్యలతో భయాందోళనలు సృష్టించాడు. ఒత్తిడితో కొంత డబ్బు చెల్లించినప్పటికీ, వేధింపులు కొనసాగిస్తూ మరిన్ని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు మార్కెట్ పోలీసులను ఆశ్రయించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.



## ఓయూలో డ్రోన్ టెక్నాలజీ ఇన్ జియో సైన్సెస్‌పై రెండు రోజుల కార్యశాల

సికింద్రాబాద్, మార్చి 31 (మనం న్యూస్) ఉస్మానియా యూనివర్సిటీ భూగోళ శాస్త్ర విభాగంలో"డ్రోన్ టెక్నాలజీ ఇన్ జియో సైన్సెస్"అనే అంశంపై రెండు రోజుల కార్యశాల ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీనియర్ ప్రొఫెసర్ విద్యుల్లత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవాటు చేసుకున్న విద్యార్థులు కెరీర్, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ముందంజలో ఉంటారని అన్నారు. విపత్తు నిర్వహణలో డ్రోన్ల వినియోగం అత్యంత కీలకమని, అత్యవసర పరిస్థితుల్లో వాటి సేవలు అమూల్యమని పేర్కొన్నారు. భూగోళ శాస్త్ర విభాగాధిపతి సీనియర్ ప్రొఫెసర్ టి. అనురాధ మాట్లాడుతూ ఉన్నత విద్యాశాఖ మార్గదర్శకాలు, ఓయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం సూచనల మేరకు విద్యార్థులకు ఆధునిక సాంకేతికతను అందించాలనే లక్ష్యంతో ఈ కార్యశాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్రోన్ సర్వే సాంకేతికతను విద్యార్థులకు బోధించడంలో, డ్రోన్ సదుపాయాలను కలిగి ఉన్న కొద్ది విభాగాల్లో ఓయూ భూగోళ శాస్త్ర విభాగం ఒకటిగా నిలుస్తోందని చెప్పారు. డీజీసీఏ ఆమోదం పొందిన, భారతదేశంలో తయారైన టైప్ సర్టిఫైడ్ డ్రోన్ కలిగిన ప్రభుత్వ విశ్వవిద్యాలయ విభాగంగా ఇది ప్రత్యేక గుర్తింపు పొందిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్యశాలలో రిసోర్స్ పర్సన్ ఇంజనీర్ డా. నర్సింగ్ రావు, సీనియర్ ప్రొఫెసర్లు బి. శ్రీ నగేష్ (బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్), ఏ. బాలకిషన్, డా. అత్తర్ అలీ, డా. సుదర్శన్, డా. ఇందిరా, డా. వీణతో పాటు పరిశోధన, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే తెలంగాణ యూనివర్సిటీ, చాకలి ఐలమ్మ ఉమెన్స్ యూనివర్సిటీ, డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బేగంపేట్కు చెందిన అధ్యాపకులు కూడా హాజరయ్యారు.




## ఫుట్పాత్ ఆక్రమణలపై కాప్రా మున్సిపాలిటీ కొరడా..

**- సర్కిల్ పరిధిలో భారీగా తొలగింపులు..**




కాప్రా, మార్చి 31 (మనం న్యూస్) : మేడ్చల్ మల్కాజ్గిరి కార్పొరేషన్ పరిధి కాప్రా సర్కిల్ లో ఫుట్పాత్ ఆక్రమణలపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఏ.ఎస్.రావు నగర్, కాప్రా డివిజన్ పరిధిలోని రాధిక-దమ్మాయిగూడ ప్రధాన రహదారి వెంబడి అక్రమంగా ఆక్రమించిన ఫుట్పాత్ ఎంక్రోచ్మెంట్లను అధికారులు భారీగా తొలగించారు. కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి ఆదేశాల మేరకు టీపీఎస్ తుల్జాసింగ్ ఆధ్వర్యంలో ఈ డ్రైవ్ నిర్వహించారు. జేసీబీ యంత్రాల సహాయంతో సిమెంట్ దిమ్మెలు, సైన్ బోర్డులు, ఇనుప చువ్వలు, గ్రిల్స్ వంటి నిర్మాణాలను తొలగించారు.

ఫుట్పాత్లను ఆక్రమించడం వల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అధికారులు ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసులను భారీగా మోహరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

మున్ముందు కూడా ఆక్రమణలపై నిరంతరంగా చర్యలు కొనసాగుతాయని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్, ఏ సి పి కృష్ణమూర్తి, సెక్షన్ ఆఫీసర్ తుల్జా సింగ్, చైర్మన్ రమేష్, ఎన్ఫోర్స్మెంట్ టీం రాజ్ కుమార్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

